ప్రజాశక్తి
శుక్రవారం 29 మార్చి 2024
5
అనంతపురం



గుర్తింపుకార్డుతో ఓటు వేయొచ్చు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన సమయంలో ఓటర్లు ఓటు వేసేందుకు ఓటరు గుర్తింపు లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదేని గుర్తింపు కార్డులను చూపించాలని కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. ఓటు వేసేందుకు గుర్తింపు కార్డుల విషయంపై గురువారం ఆమె పలు విషయాలను ఓటర్లకు తెలియజేశారు. ఓటరు గుర్తింపు కార్డు లేని వారు ప్రత్యామ్నాయంగా ఫొటో గుర్తింపు కార్డులను చూపించవచ్చున్నారు. ఆధార్ కార్డ్, ఉపాధి జాబ్ కార్డ్, బ్యాంక్,పోస్టాఫీసు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్‌లు, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, స్మార్ట్ కార్డ్, భారతీయ పాస్‌పోర్ట్ తదితర 12 రకాల గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయవచ్చున్నారు.

పండ్లతోటల రైతులకూ కష్టాలే..!

వర్షాభావంతో ఖరీఫ్, రబీ సీజన్లలో వరుసగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఉన్నపాటి నీటి వనరులతో బోరుబావుల కింద పండ్ల తోటల సాగుపై దృష్టి సారించారు. ఈ పండ్ల తోటలు కూడా రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. అరటి, చీనీ, మామిడి, సపోటా తదితర పంటలు ఏదో రూపంలో నష్టాన్ని తెచ్చిపెడుతూ రైతులను అప్పుల్లోకి నెట్టేస్తున్నాయి.



నామనాంకపల్లిలో తెగుళ్లు సోకిన చీనీచెట్లను తొలగించిన రైతు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు, పుట్లూరు

పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా చాలా మంది రైతులు చీనీ చెట్లను సాగు చేశారు. కంటికి రెప్పలా చెట్లను కాపాడుకుంటూ వచ్చారు. ఇక్కడ కూడా రైతులకు నష్టాలు తప్పలేదు. పంట కాయలు కాసే సమయానికి చీనీ చెట్లు తెగుళ్ల బారిన పడి ఎండిపోతున్నాయి. చేసేది లేక రైతులు చెట్లను నరికివేస్తున్నారు. పండ్లతోటల సాగు నిమిత్తం ఖర్చు చేసిన లక్షలాది రూపాయలను రైతులు నష్టపోతున్నారు. పెద్దపప్పూరు మండల పరిధిలోని నామనాంకపల్లిలో రైతులు చీనీ చెట్లను సాగు చేశారు. దాదాపు పది సంవత్సరాల పాటు వాటిని కాపాడుకున్నారు. ఈ ఏడాది ప్రస్తుతం చెట్లు కాపునకు వచ్చాయి. ఇదే సమయంలో చెట్లకు వేరుకుళ్లు తెగుళ్లు సోకాయి. దీంతో చెట్లు ఆకులు రాలి మొత్తం ఎండిపోయాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా చెట్లు బతక్కపోవడంతో చేసేది లేక రైతులు వాటిని తొలగించేస్తున్నారు. ఇలా నామనాంకపల్లి గ్రామంలో రైతు కులశేఖర్‌రెడ్డి ఎనిమిది సంవత్సరాల వయస్సున్న 400 చెట్లను తొలగించేశాడు. ఈ ఒక్క రైతుకే దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ఇదేరకమైన తెగుళ్లతో పండ్ల తోటలు ఎండిపోతున్నట్లు తెలుస్తోంది.

కళ్లేదుటే చెట్లు ఎండిపోయాయి...



ఉన్న కొద్దిపాటి నీటి వసతితో తనకున్న నాలుగు ఎకరాల్లో చీనీ చెట్లను సాగు చేశాను. ఎనిమిది సంవత్సరాలుగా కంటికి రెప్పలా వాటిని కాపాడుకున్నాయి. నెల రోజుల క్రితం వరకు చెట్లు బాగానే ఉన్నాయి. తర్వాత ఆకులు రాలడం మొదలయ్యింది. దీని కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు చల్లాను. అయినా ప్రయోజనం లేదు. చివరకు తెగుళ్ల దెబ్బకు చెట్లు మొత్తం ఎండిపోయాయి. చేసేది లేక 400 చెట్లను తొలగించేశాను.

కులశేఖర్‌రెడ్డి, రైతు, నామనాంకపల్లి.

భూమి సారవంతం తగ్గడం వల్లే..

ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులు వేయడం వల్ల భూమి సారవంతం కోల్పోతుంది. దీని వల్ల వేర్లకు తెగుళ్లు సోకుతాయి. వేర్లకు తెగుళ్లు సోకితే చెట్లు ఎండిపోతాయి. రైతులు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించాలి. తద్వారా భూమి సారవంతం అయ్యి ఎండు తెగుళ్లు తగ్గిపోతాయి.

ఉమాదేవి, ఉద్యానవన అధికారి.

- ◆ 'చీనీ'కి తెగుళ్ల పోటు..!
- ◆ అరటికి నీటి కరువు
- ◆ ఎండిపోతున్న చెట్లు
- ◆ కాత వచ్చే సమయంలో రైతుకు కష్టం
- ◆ నామనాంకపల్లిలో చీనీ, నాగిరెడ్డిపల్లిలో అరటి చెట్లు తొలగింపు

నీరులేక.. ఎండిన అరటితోట..!

ప్రజాశక్తి-పుట్లూరు

గత సంవత్సరం నుంచి వర్షాలు లేకపోవడంతో బోరుబావుల్లో నీరు పాతాళానికి చేరింది. దీనికి తోడు హెచ్ఎల్‌సి నీటిని కూడా విడుదల చేయకపోవడంతో పండ్ల తోటల రైతులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. బోరుబావుల్లో నీరు అడుగండడంతో పంటలను కాపాడుకోవడం అన్నదాతకు శక్తికి మించిన పనిగా మారింది. అప్పులు చేసి దాదాపు 1500 అడుగుల మేర బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు బయటికి రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చేసేది లేక రైతులు పండ్ల తోటలను తొలగించేస్తున్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి తనకున్న మూడున్నర ఎకరాల పొలంలో గత నాలుగు నెలల క్రితం అరటి పంటను సాగు చేశాడు. చెట్లు పెరుగుతున్న క్రమంలో భూగర్భ జలాలు అడిగంటిపోయాయి. బోర్లను నుంచి ఒక చుక్క కూడా నీరు రాకపోవడంతో చెట్లకు తడిలేక ఎండుదశకు చేరుకున్నాయి. నీటి వసతి లేనికారణంగా నాలుగు నెలల పాటు ఎంతో కష్టపడి పెంచిన అరటిమొక్కలను కాపాడుకోవడం కష్టం అని భావించి గురువారం నాడు ట్రాక్టర్ తొలగించేశాడు. దీంతో రైతుకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పండ్ల తోటలు ఆదుకుంటాయని సాగు చేస్తే అవి కూడా నష్టాన్ని మిగిల్చాయంటూ రైతు రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు.



పుట్లూరు మండలం నాగిరెడ్డిపల్లిలో నీరు లేక ఎండిపోవడంతో ట్రాక్టర్‌తో దున్నేసిన అరటి పంట




రైతు రామచంద్రారెడ్డి



రాప్తాడులో ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

- ◆ చంద్రబాబు పర్యటనలో తమ్ముళ్ల జోరు
- ◆ రాష్ట్రాన్ని నాశనం చేశారంటూ జగన్‌పై విమర్శలు
- ◆ స్థానిక ఎమ్మెల్యేల అవినీతిని ఎండగడుతూ ప్రసంగం
- ◆ విభేదాలు వీడి గెలుపునకు పని చేయాలని తమ్ముళ్లకు ఉద్బోధ

టిడిపిలో జోష్



బుక్కరాయసముద్రంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత జరిపిన టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తొలి పర్యటన తమ్ముళ్లలో జోష్ నింపింది. ఒకేరోజు మూడు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. మదనపల్లి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో అనంతపురం విచ్చేసిన ఆయన ఉదయం రాప్తాడు బహిరంగ సభలో పాల్గొన్నారు. అక్కడ బిసిల గురించి ఎక్కువ ప్రస్తావిస్తూ ప్రభుత్వం, వైసిపి తీరుపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై ఆరోపణలు చేయడంతోపాటు తాము అధికారంలోకి వస్తే విచారణ చేపడతామని హెచ్చరికలు జారీ చేశారు. ఇసుక మొదలుకుని అన్నింటినీ దోచేసారని మండిపడ్డారు. బిసిలకు వైసిపి పాలనలో రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు. ఈ సభకు నియోజకవర్గంలోని వేలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సభ అనంతరం మధ్యాహ్నం ఆర్‌డీటీ అతిథి గృహంలో బస చేశారు. తదనంతరం మధ్యాహ్నం నుంచి బుక్కరాయసముద్రంలో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సభకు టిడిపి అభ్యర్థి బండారు శ్రావణితోపాటు అసంతృప్త నేతలుగానున్న ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి రామలింగారెడ్డి ముగ్గురూ పాల్గొన్నారు. ఈ సభలో చంద్రబాబు దళితుల సమస్యలను ఎక్కువగా ప్రస్తావించారు. వైసిపి పాలనలో దళితులకు రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు. వైసిపిలో శింగనమల టిక్కెట్టు తన దగ్గర పనిచేసే ఉద్యోగికి ఇప్పించి అధికారాన్ని తన చేతుల్లో పెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైసిపి ఎమ్మెల్యే నియోజకవర్గం పరిధిలో చేసిన అవినీతి అక్రమాలను ఎండగట్టారు. శింగనమల నియోజకవర్గం ఉద్యానవన పంటలకు ప్రసిద్ధి అని, సాగునీటి వసతి కల్పిస్తే బంగారం పండిస్తారని తెలిపారు. వైసిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసారని విమర్శించారు. దళితులకు రక్షణగా టిడిపి ఉంటుందని హమీలిచ్చారు. కదిరిలో ముస్లిం మైనార్టీలతో సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇలా బీసీ, ఎస్సీ ,మైనార్టీలను ఆకట్టుకునేలా చంద్రబాబు నాయుడు పర్యటనను కొనసాగించారు. వైసిపి హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యనికి గురయ్యాని విమర్శించారు. అనంతపురం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను చేపట్టకుండా మోసం చేసారని మండిపడ్డారు. పరిశ్రమలు ఒక్కటీ రాలేదని, వచ్చిన జాకీ పరిశ్రమను పారిపోయేటట్టు చేసారని దుయ్యబట్టారు. స్థానిక సమస్యలను ప్రస్తావించడంతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున అందరూ ఏకతాటిపైకొచ్చి వైసిపిని ఇంటికి పంపించే కార్యక్రమాన్ని గట్టిగా చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మొత్తంగా గురువారం జరిగిన టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పర్యటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సహాన్ని నింపింది. ఎన్నికలకు సమాయత్తం అయ్యే విధంగా ఉత్సాహాన్ని నింపిందనే చెప్పాలి. ఈ కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు బండారు శ్రావణి, పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, కాలవ శ్రీనివాసులు, బికె.పార్థసారధి, పరిటాల శ్రీరామ్‌తో పాటు ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీఏలో చేరాం



కదిరిలో ముస్లిములతో కలిసి ప్రార్థనలు చేస్తున్న చంద్రబాబు నాయుడు

కదిరి అర్బన్ : రాష్ట్ర ప్రయోజనాలు, పిల్లల భవిష్యత్తు కోసమే ఎన్డీఏలో చేరామని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. ప్రజాగళం పర్యటనలో భాగంగా కదిరి పట్టణంలోని ఎస్‌టిఎన్ డిగ్రీ కళాశాల ఆవరణలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిములకు మిఠాయిలు తినిపించి దీక్షలను విరమింపజేశారు. అనంతరం సామూహిక ప్రార్థనలో చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడారు. 2004 నుంచి 2019 వరకు మైనార్టీల హక్కులను కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ ఎనలేని కృషి చేసిందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు ఏ ప్రభుత్వాలూ అందించని విధంగా రంజాన్ తోఫా అందించామని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్న విషయంపై ఎలాంటి అపోహలు వద్దన్నారు. టిడిపి ఎక్కడ ఉన్నా మైనార్టీల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అరాచక పాలనను సాగనంపి ప్రజా పాలన కావాలంటే ఎన్డీఏ ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని మైనార్టీలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పవన్ కుమార్ రెడ్డి, మైనార్టీ మత పెద్దలు, నియోజకవర్గం లోని ముస్లిములు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు మార్చి 16 నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటాయన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమాల్ని అమలు చేసేందుకు మూడు మండలాల ఎంపిడిఒలు, రెండు మున్సిపాలిటీల కమిషనర్లను కలిపి ఐదు టీంలను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి వారి వాహనాలకు జిపిఎస్ సిస్టం కూడా ఏర్పాటు చేశామన్నారు. వీడియో సర్వేలైన్స్ కూడా నియమించామన్నారు. కాగా రాజకీయ పార్టీల నాయకులకు మద్దతుగా వాలంటీర్లు, రేషన్ షాపుల డీలర్లు, ఎండిఎస్ వాహనాల సిబ్బంది ప్రచారాలు చేస్తే వారిని తొలగించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు సభలకు ర్యాలీలకు వాహనాల అనుమతులకు 48 గంటలకు ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతుల మంజూరు కోసం సింగిల్‌విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల తహశీల్దార్లు శేషఫణి, భారతి, చంద్రశేఖర్‌నాయక్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'మెట్టు' అసమర్థ నాయకుడు

నమ్మొద్దని వైసిపి శ్రేణులకు 'కాపు' సూచన



ప్రజాశక్తి-రాయదుర్గం

'కార్యకర్తలను కాపాడే వాడే నాయకుడు.. వారికే కార్యకర్తలు మద్దతు ఇవ్వాలి' అని తాజా మాజీ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెట్టు గోవిందరెడ్డి వైసిపి లో ఉంటూ ఎపిఐఐసి ఛైర్మన్‌గా పదవిని అనుభవించి తద్వారా లబ్ధి పొందారన్నారు. గత ఐదేళ్లలో వైసిపి కార్యకర్తలు గోపి, సత్యనారాయణ, మంజు, వెంకట్, బసవరాజు, తదిదరులు మృతి చెందగా వారి ఇంటి వైపు కన్నెత్తి చూడని వ్యక్తి మెట్టు అన్నారు. కరోనాకాలంలో అనేకమంది వైసిపి కార్యకర్తలు ఆరోగ్యం బాగా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే మెట్టు ఎ ఒక్కరినీ పరామర్శించ లేద న్నారు. కార్యకర్తలు అలాంటి వారి వెంట వెళ్తే వారికి ఏమైనా అయితే ఎవరు చూస్తారని ప్రశ్నించారు. నాయకుడు అనే వారికి అర్హత ఉండాలని.. నమ్మిన వారిని కాపాడే శక్తిలేని వారిని కార్యకర్తలు కూడా పట్టించుకోవద్దని హితవు పలికారు. మెట్టు ఏనాడూ కార్యకర్తలను పరామర్శించలేదు, సాయం చేయలేదన్నారు. తాను పార్టీని వీడినప్పటికీ కార్యకర్తలకు ఓ అన్నగా, తమ్ముడిగా, కుటుంబ సభ్యుడిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. చేతనైన సాయం చేస్తానన్నారు. ఎవరైతే కార్యకర్తలను బాగా చూసుకుంటారో, సాయం చేస్తారో అలాంటి వారిని నమ్మాలని.. అసమర్థులను నమ్మవద్దని కాపు రామచంద్రారెడ్డి వైసిపి శ్రేణులకు సూచించారు.

వేలంపాట ద్వారా చీనీ పంట కొనుగోలు సాగాలి

సూట్ విధానం అరికట్టాలి- ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం మార్కెట్ యార్డులో చీనీ పంటను వేలంపాట ద్వారా విక్రయాలు సాగాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ చీనీ పంట కొనుగోలులో సూట్ విధానం అరికట్టాలన్నారు. కమిషన్‌ను 4 శాతానికి తగ్గించాలన్నారు. జిల్లాలో సుమారు 42,490 ఎకారాల్లో 10,62,260 టన్నుల చీనీపంటను పండిస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల, పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలతో ఎరువులు, పురుగు మందులు, చీడపురుగులు ప్రకృతి వైపరీత్యాలను రైతులు చీనీపంటను పండిస్తున్నారన్నారు. అయితే పాలకులు పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం వల్ల దళారుల చేతుల్లో రైతులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను మార్కెట్‌కు తెచ్చిన రైతుకు సరైన ధర రావడం లేదన్నారు. మార్కెట్‌లో మొదటి రకం చీనీపంటకు టన్నుకు రూ.25 వేలు అమ్ముడుపోతోందన్నారు. అది కూడా గాలివాటంగా ఉందన్నారు. రైతులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈనాం విధానంలో రైతుల కంటే కొనుగోలు దారులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతోందన్నారు. వ్యాపారులు సిండికేట్ అయ్యి రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. మార్కెట్‌కు చీనీ పంటను తెచ్చినప్పటి నుంచి 'దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు' అన్నట్లు వ్యాపారుల దయపై రైతు రాత తయారైందన్నారు. కావున రైతులు నష్టపోకుండ చీనీకాయలు మార్కెట్‌లో ఈనామ్ రద్దు చేసి వేలం పాట ద్వార అమ్మకాలు జరిపి సూట్ తీసుకునే విధానం రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం నాయకులు విరూపాక్షి, రాజారామిరెడ్డి, పోతలయ్య, రెడ్డిపల్లి శ్రీనివాసులు, రాముడు, రమేష్, బి.చంద్రశేఖర్‌రెడ్డి, గాండ్ల శివారెడ్డి, మల్లికార్జున, వెంకటకొండ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు

'కె-6'కు కాలం చెల్లింది..

నూతన వేరుశనగ వంగడాలను సిద్ధం చేయాలి-జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్న కె6-రకం వేరుశనగ విత్తనానికి కాలం చెల్లిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారణి యు.ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో వివిధ పంటల్లో కొత్త వంగడాలను ప్రవేశపెట్టేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ సహాయ సంచాలకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేరుశనగ పంటలో ప్రధానంగా కే-6 రకాన్ని జిల్లాలో అధికశాతం మంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఈ రకం జిల్లాలో 10ఏళ్లకు పైబడి సాగు చేయడం వల్ల దిగుబడులు తగ్గి నష్టం వాటిళ్లుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో వర్షాభావ పరిస్థితులను తట్టుకునే రకాలను సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. కనీసం వచ్చే ఖరీఫ్ సీజన్‌కు నూతన వేరుశనగ విత్తనాలను అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వేరుశనగ పంటలో వర్షాభావ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులను ఇచ్చే కదిరి-9, కదిరి, లేపాక్షి -18, 12, టిజిసిజి-1694 (వశిష్ట) రకాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అలాగే కంది పంటలో ఎల్‌ఆర్‌జి-41 రకానికి బదులు పిఆర్‌జి-176 రకం, కొర్ర పంటలో సూర్యనంది, గరుడ రకాలను సూచించామన్నారు. ఈకార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, వేరుశనగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నరాజేష్, కెవికె కోఆర్డినేటర్లు మల్లేశ్వరి, రాధాకుమారి, డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, యల్లప్ప, పద్మజ, వెంకటరాముడు, గురుమూర్తి, సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్‌నాయక్, వెంకట్‌కుమార్, బాలానాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరి

వడ్డీ రాయితీకి మూడు రోజులు గడువు

కమిషనర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి అనంతపురం. కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పన్ను బకాయి ఏక మొత్తంగా మార్చి నెలాఖరులోగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ గడువు మరో 3 రోజుల్లో ముగియనుందని కమిషనర్ మేఘస్వరూప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాకుండా నెలాఖరులో సర్వర్ ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున ఏప్రిల్ 1, 2024 నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా జమ అవుతుందన్నారు. కాగా పన్నులు చెల్లించకుండా బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ కూడా తయారు చేశామన్నారు. శుక్రవారం కూడా నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ పని చేస్తాయన్నారు. కావున నగర ప్రజలు ఈనెలాఖరు వరకూ వేచి చూడకుండా ముందుగానే పన్నులు చెల్లించాలని రాయితీ పొందాలని కోరారు.

నలుగురు వాలంటీర్ల తొలగింపు

అనంతపురం కలెక్టరేట్ : ఎన్నికల నియామవళి ఉల్లంఘించినం దుకు నలుగురు వాలంటీర్‌లను విధుల నుంచి తొలగించినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. రాజకీయ పార్టీలు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండల పరిధిలో పని చేస్తున్న సచివాలయ వాలంటీర్లు ముగ్గురు సిర్రప్ప గారి శివయ్య, రాకెట్ల రమేష్, మహబూబ్‌బాషా, శింగనమల నియోజకవర్గంలో వాలంటీర్ ఎం.సాయినాథ్‌రెడ్డిని తొలగించినట్లు తెలిపారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న కమిషనర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఇటీవల మృతిచెందిన అవుట్ సోర్సింగ్ కార్మికులు ఎట్టి కుళ్లాయప్ప కుటుంబానికి కార్మిక సంఘం సేకరించిన విరాళాన్ని కమిషనర్ మేఘస్వరూప్ గురువారం ఆర్థికసాయం అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని 5వ పారిశుధ్య సర్కిల్‌లో కుళ్లాయప్ప ఔట్‌సోర్సింగ్ కార్మికునిగా పని చేసేవాడు. ఈనేపథ్యంలో అనారోగ్యంతో మృతిచెందడంతో కార్మికుల ఒక్కరోజు వేతనం రూ.400 చొప్పున సేకరించిన రూ.96వేల మొత్తాన్ని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, కె.నాగభూషణం, రెగ్యులర్ ఉద్యోగ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ముత్తరాజు, ఎం.నల్లప్ప, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్‌మూర్తి, నగర అధ్యక్షులు బండారి స్వామి, ట్రెజరర్ లక్ష్మీనరసమ్మ, ఇంజనీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, రాయుడు, నగర కార్యదర్శి, మురళీ, నగర కమిటీ సభ్యులు ప్రభాకర్, రాఘవేంద్ర ప్రసాద్, నల్లప్ప, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

సేవ్ వాటర్ క్యాంపెయిన్ యాక్షన్ ప్రణాళిక రూపొందించాలి-వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వేసవిలో తాగునీటి సరఫరాపై జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలకసంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిపిఒ ప్రభాకర్‌రావు, ఆర్డబ్ల్యూఎస్ డిఇలు, ఎఇలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవికాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా చూడాలన్నారు. జిల్లాలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించామని, ఆయా మండలాల్లో క్షేత్రస్థాయిలో భూగర్భజలాలు అడుగంటిపోయాయని, వచ్చే రెండు, మూడు నెలలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. పిఎబిఆర్ తాగునీటికి ప్రధాన వనరుగా ఉందని, ఉన్న నీటిని చాలా జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. జిల్లాలో పైప్లేన్ లీకేజీ, అదనపు వాల్ డిఫాల్ట్స్‌ని అరికట్టడం, స్కీమ్స్ పనిచేసేలా చేయడం, జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టడం ఎప్పటికప్పుడు చేయాలన్నారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు అందుబాటులో ఉన్నాయని, గ్రామపంచాయతీలో 38.28 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఎక్కడైనా తాగునీటికి ఇబ్బంది ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక నీటి ఇబ్బంది ఎక్కడ తలెత్తకూడదని, ఎక్కడైనా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో పలు ఫిర్యాదులు వస్తున్నాయని, ఫిర్యాదులు రాకుండా అధికారులు యాక్టివ్‌గా పని చేయాలన్నారు. ముఖ్యంగా రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో నీటి సమస్యపై ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నీటి సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో కంట్రోల్ రూమ్‌ని, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు మండల, పట్టణ ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎక్కడైనా నీటి సరఫరాలో సమస్య వచ్చినా తెలుసుకోవాలని, ముందుగానే ప్రతి స్కీమ్‌ని పరిశీలన చేసుకుని అవి పనిచేసేలా చూడడం ఎంపిడిఒల బాధ్యత అన్నారు. చివరి ఇళ్ల వరకు తాగునీటి సరఫరా చేయాలని, చివరి ఇళ్ల వరకు నీరు సరఫరా అవుతోందా లేదా అనేది పరిశీలన చేయాలన్నారు. సేవ్ వాటర్ క్యాంపెయిన్ చేపట్టాలని, నీటి వృథాని అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం యాక్షన్ ప్రణాళిక రూపొందించాలన్నారు. చాలాచోట్ల నిధులు అందుబాటులో ఉన్న ఉపయోగించడం లేదని, నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. తాగునీటి కోసం విద్యుత్ కనెక్షన్లు ఎప్పటికప్పుడు ఇచ్చేలా ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇతో నిత్యం సమన్వయం చేసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ హసాన్‌బాషా, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ జవహర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు సభకు వెళ్తున్న తెలుగు తమ్ముళ్లు

చంద్రబాబు సభకు తరలిన టిడిపి శ్రేణులు

నార్పల : బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభకు ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, జిల్లా నాయకులు వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి శ్రేణులు భారీగా వెళ్లాయి. ముందుగా ఏర్పాటు చేసిన వాహనాల్లో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పుట్లూరు : బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభకు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం భారీగా తరలివెళ్లారు. వెళ్లిన వారిలో కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డిపల్లి రామునిరెడ్డి, మడ్డిపల్లి శివారెడ్డి, బాలాపురం రామచంద్రారెడ్డి, గోపరాజుపల్లి రవికుమార్‌రెడ్డి, పుట్లూరు ఎల్కె చెన్నారెడ్డి, కడవకల్లు గోవర్ధనరాజు, సంజీపురం పవన్‌కుమార్‌రెడ్డి, రంగయ్య, రామచంద్రనాయుడు, రవికుమార్‌నాయుడు, తాజ్, జయచంద్రారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

30న 'డయల్ యువర్ డిఎం'

రాయదుర్గం : ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య 'డయల్ యువర్ డిఎం' నిర్వహిస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ రవాణాకు సంబంధించి సమస్యలు, సలహాలు, సూచనలను ఈ నెంబర్ 99592 25863కు ఫోన్ చేసి తెలుపవచ్చు అన్నారు.

టిడిపి నేత ఆధ్వర్యంలో ఇఫ్తార్

బొమ్మనహాల్ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఉన్న ముస్లింలకు గురువారం స్థానిక నూరాణి మసీదులో టిడిపి మైనార్టీ నాయకుడు రహంతుల్లా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు మజీద్ ముతవల్లి నూర్‌మహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొని ఇఫ్తార్ ఇందు స్వీకరించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రభుత్వ వైద్యాధికారి అనికేత్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి అనికేత్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి అనికేత్ సూచించారు. గురువారం మండలంలోని పెద్ద కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న నింబగల్లు ఉన్నత పాఠశాలలో వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ ఎండలో ఎక్కువ తిరగడం, నీరు సరిగా తీసుకోకపోవడంతో శరీర ఉష్ణోగ్రత పెరిగి, శరీరంలో నీటిశాతం తగ్గి వడదెబ్బకు గురవుతారన్నారు. తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, శరీర ఉగ్రత పెరగడం, నీరసంగా ఉండడం వంటి లక్షణాలు కనిసిస్తే వడదెబ్బగా భావించి వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అంతకంటే ముందు వడదెబ్బ తగిలిన వ్యక్తిని నీడ ప్రాంతానికి తరలించి, గాలి తగిలేటట్టు చూడాలన్నారు. తడి బట్టను ఐస్ వాటర్‌లో ముంచి శరీరమంతా తుడవాలన్నారు. ఒకవేళ వ్యక్తి స్పృహ కోల్పోయినట్లయితే ఎలాంటి ద్రావణాన్ని తాగించరాదన్నారు. వెంటనే 108 ద్వారా ఆసుపత్రికి తరలించాలన్నారు. ప్రజలు, కూలీలు తమ పనులను 10 గంటల్లోపు ముగించుకోవాలన్నారు. తలపైన రుమాలు లేదా టోపీను ధరించాలన్నారు. గంట, అరగంటకు ఒకసారి ఒక గ్లాసు మంచినీరు తాగాలన్నారు. అలాగే ప్రతిగ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్వాడీ కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా లభిస్తాయన్నారు. ఒక లీటర్ నీటిలో ఒక ఒఆర్ఎస్ ప్యాకెట్‌ని కలుపుకుని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సహాయకులు ప్రసాద్‌రావు, ఏఎన్ఎం నాగమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆదరించండి.. మీకోసం పనిచేస్తా..'

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు


మహిళలకు నమస్కరిస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు

నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనను ఆదరించండి.. ప్రజలతోపాటు సిఎం జగనన్నకు బాధ్యుడినై ఉంటూ సేవ చేస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం యల్లనూరు మండలం నేర్జాంపల్లి, లక్షుంపల్లి, దంతలపల్లి, గడ్డంవారిపల్లి, లింగారెడ్డిపల్లి, మల్లాగుండ్ల గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళిక ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి జగనన్నను మళ్లీ సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారుక. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తోడుగా సామాజిక న్యాయాన్ని చేతల్లో అమలు చేసి చూపిస్తున్న ప్రభుత్వం మనదే అన్నారు. 'నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ' అంటూ పేదలందరికీ కులం, మతం, రాజకీయం చూడకుండా సామాజిక న్యాయం చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చెప్పిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపించారన్నారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

మహా కూటమికి ఎంఆర్‌పిఎస్ మద్దతు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఎన్‌డిఎ మహా కూటమికి ఎంఆర్‌పిఎస్ రాష్ట్రవ్యాప్తంగా పూర్తి మద్దతు ఇస్తోందని ఎంఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ మాదిగ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఈనెల మార్చి 30న గుంటూరు వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి అనుబంధ విభాగాల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఆర్‌పిఎస్ మందకృష్ణ ఆదేశాల మేరకు... వచ్చే ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన కూటమికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గ ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థి జెసి అశ్వంత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు తబ్జూల రామాంజనేయులు మాదిగ, ఉపాధ్యక్షులు ఎర్ర రామన్నగారి రామాంజనేయులు మాదిగ, మండల అధ్యక్షులు పసల కంబగిరి మాదిగ, పెద్దింటి లక్ష్మీనారాయణ, సంధికల పెద్దయ్య, చిన్నరాజు, చంటిగాళ్ల ఆదినారాయణ, అమ్మలదిన్నె పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : వైసిపి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదిస్తేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మండల వైసిపి నాయకులు అన్నారు. గురువారం మండల పరిధిలోని రామనేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లి తండాలో 'ఇంటింటికీ మన విశ్వన్న' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, కన్వీనర్ మచ్చన్న, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, నాయకులు శ్రీనివాసులు, రమేష్, కరుణాకర్, బాబురెడ్డి, తిప్పేస్వామి, పాతన్న, అనిల్, మల్లికార్జున, మారెన్న, తిమ్మప్ప, ధనుంజయ, వీరాంజి, శ్రీరాములు, సన్నప్ప, నారాయణస్వామి, వేణుగోపాల్, కమీల్యానాయక్, రాజునాయక్, గోపాల్‌నాయక్, తావుర్యానాయక్, కృష్ణానాయక్, అంగడిరాజు, తిప్పేస్వామి నాయక్, రాజునాయక్, వి.రమేష్‌నాయక్, ఎన్ఎస్.రాజూనాయక్, లక్ష్మానాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి


పెద్దయ్య మృతికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వడ్డే పెద్దయ్య గురువారం మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ తనయుడు, టిడిపి యువ నాయకులు ఆర్.ధర్మతేజగౌడ్ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంరం రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మోడే శ్రీనివాస్‌యాదవ్, టిడిపి నాయకులు వెంకటరమణ, సాంబశివయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి నాయకుడు రవితేజ నారాయణస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి గుమ్మనూరు జయరాం సోదరులు ఇచ్చిన రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు, మనీ, రమణ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సిఐ సురేష్‌బాబు

ప్రజాశక్తి-ఉరవకొండ

డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌బాబు సూచించారు. గురువారం ఉరవకొండలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద క్యాబ్ డ్రైవర్లకు క్షేమకరమైన, ప్రమాద రహితమైన డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను సురక్షిత ప్రదేశాలకు చేర్చే విషయంలో డ్రైవర్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకుని వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు నియమ, నిబంధనలు పాటించి ఓర్పు, సహనంతో డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ కుటుంబ బరువు బాధ్యతలున్న విషయాన్ని గుర్తు చేసుకుని, ప్రమాదాలు జరిగితే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

విధుల్లో చేరిన అనంతపురం ఎఒ జె.శశికళ



ప్రజాశక్తి-అనంతపురం

ఆనంతపురం రూరల్ మండలం రెగ్యులర్ వ్యవసాయ అధికారిణి జె.శశికళ గురువారం తిరిగి విధుల్లో చేరారు. ప్రసూతి సెలవుల్లో భాగంగా డిసెంబర్‌లో ఆమె సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇద్దరిని ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారులను నియమించారు. ఈనేపథ్యంలో రెగ్యులర్ అధికారిణిగా శశికళ తిరిగి విధుల్లోకి చేరారు.

ఎమ్మెల్సీ మాతృమూర్తి లలితమ్మ వైకుంఠ సమారాధన

ఉరవకొండ : శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాతృమూర్తి వై.లలితమ్మ వైకుంఠ సమారాధన గురువారం స్వగ్రామం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో అభిమానులు, నాయకులు తరలివచ్చి లలితమ్మకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఆయన సోదరులు సీతారామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, కర్నూలు జిల్లాల ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లలితమ్మకు నివాళులర్పిస్తున్న కుమారులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు గాయాలు


మృతిచెందిన ఆదిలక్ష్మి

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందింది. భర్త తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దవడుగూరుకి చెందిన బాబు, ఆదిలక్ష్మి (45) దంపతులు నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కటారికొండ గ్రామానికి బంధువుల వివాహానికి వెళ్లారు. వివాహానంతరం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా బాచుపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మరణించింది. తీవ్ర గాయాలైన బాబును చికిత్స నిమిత్తం 108 వాహనంలో గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

పెద్దవడుగూరు : మండలంలోని లక్షుంపల్లిలో గురువారం ఆటోలో ఐదుగురు వ్యక్తులు వచ్చి గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో గ్రామస్తులకు అనుమానం వచ్చి పోలీసులకు అప్పగించారు. నంద్యాల జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఇక్కడి ప్రాంతంలో అడవిలో లభించే మూగజీవాలను తీసుకెళ్లడానికి వచ్చారా? లేక పిల్లల్ని కిడ్నాప్ చేయడానికి వచ్చారా? అనే అనుమానాలు ఉండటంతో గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. నిందితులును అదుపులోకి తీసుకున్న ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు విచారణ చేపట్టారు. డోన్ పోలీసులకు సమాచారం అందించి వీరి పేర్లతో కేసులు, తదితర వాటిపై ఆరా తీస్తున్నారు. ఐదుగురు వేలిముద్రల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కంటి శస్త్రచికిత్సకు తరలింపు


శస్త్రచికిత్సకు వెళ్తున్న వృద్ధులు

నార్పల : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల నుంచి గురువారం కంటి ఆపరేషన్ల నిమిత్తం 32 మంది వృద్ధులను కంటి వైద్యులు ప్రసాద్ ఆధ్వర్యంలో కడప క్రిష్ణగిరి నేత్రాలయానికి బస్సులో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గురువారం నార్పల ప్రాథమిక వైద్యశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల అనంతరం కంటి ఆపరేషన్లు అవసరమైతే వారికి కడప క్రిష్ణగిరి నేత్రాలయంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడానికి ఒకతేదీ ఇచ్చినట్లు తెలిపారు. వీరందనీ ఆ తేదీన అక్కడికి తరలించి ఆపరేషన్లు చేయించి తిరిగి తీసుకురానున్నట్లు తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

గుత్తి : పట్టణంలోని కాలవగడ్డ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానంలో శుక్రవారం నుంచి యునైటెడ్ ఛాంపియన్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీ భువన డయాగ్నస్టిక్ సెంటర్ యజమాని ఎ.శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో జరిగే ఈటోర్నీలో 20 జట్లు తలపడనున్నట్లు వివరించారు. టోర్నమెంట్ విజేతలకు రూ.50వేలు, రన్నర్స్‌కు రూ.30వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు ఎ.శ్రీనివాసబాబు, డి.రాఘవేంద్ర, టి.సురేష్‌బాబు, ఆర్.కుమార్ (జోషి), ఎ.గంగాధర్, జె.శివ, ఎం.వేదమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పట్టు కేశవ పిళ్లై'కి నివాళి

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధులు పట్టు కేశవ పిళ్లై వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేశవ పిళ్లై చేసిన సేవలను వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాన్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు సి.విజయభాస్కర్, ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు, అన్వర్‌ఖాన్, జలజాక్షి, భార్గవి, కరీం, రమేష్‌బాబు, ఉమామహేశ్వరి, సిబ్బంది మాబు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ఫిర్యాదులకు ఫోన్ నెంబర్ ఏర్పాటు

రాయదుర్గం : పట్టణంలో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు పురపాలక సంఘంలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్, మున్సిపల్ ఇంజినీర్ సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 79950 80752 నంబర్‌కు ఫోన్ చేసి నీటి సమస్యపై వివరాలు తెలిపితే నమోదు చేసుకొని సంబంధిత విభాగం సిబ్బంది సాయంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో నీటి ఎద్దడి నివారణకై జిల్లా కమాండ్ కంట్రోల్ ఫోన్ నెంబర్ 94940 96427కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

రాయదుర్గం : అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్ష లో విద్యార్థినులు అర్హత సాధించి ఎంపికయ్యారు. అందులో గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామం లోని ప్రాథమిక పాఠశాలకు చెందిన హెచ్.అంజలి, డి.సావిత్రి(బ్రహ్మసముద్రం) అర్హత సాధించినట్లు హెచ్ఎం వి.హనుమంతరాయ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది ముగ్గురు ఎంపిక కాగా ఇప్పటివరకు మొత్తం 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్నత స్థాయి ప్రమాణాలతో ఆంగ్ల మాధ్యమంలో రెసిడెన్షియల్ విధానంలో విద్యనందించే ఉద్దేశంతో ప్రారంభించిన గురుకుల పాఠశాలల్లో కరువు ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఎంపికవడం హర్షణీయమన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు


వైసిపి నాయకులను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

ఆత్మకూరు : టిడిపి అధినేత చంద్రబాబు నియోజకవర్గ పర్యటనలో భాగంగా మండల కేంద్రానికి చెందిన పలువురు వైసిపి నాయకులు మాజీమంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో ఆత్మకూరుకు చెందిన ఆవుల మాధవరెడ్డి, ఎస్.శివారెడ్డి, సి.భూసిరెడ్డి, ఎ.శ్రీరామిరెడ్డి, ఎ.పోతిరెడ్డి, జి.వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం


చంద్రబాబుకు బొకే అందజేస్తున్న ప్రభాకర్‌చౌదరి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా పర్యటనకు వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబుకు అనంతపురం అర్బన్ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి గురువారం ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ప్రసన్నాయపల్లి హెలిపాడ్ వద్దకు చేరుకుని పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చంద్రబాబు కాన్వాయ్ వెంట బయలుదేరి రాప్తాడు సభలో పాల్గొన్నారు.